# " ఆత్రేయ వాస్తవం నాటకం – పరామర్శ "

--డా.బెల్లి యాదయ్య

ప్రధానాచార్యులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్నపేట

ఆధునిక యుగంలో సైన్సు,సాంఘిక శాస్త్రాలతో

పాటు సాహిత్యమూ బహుముఖాలుగా అభివృద్ధి చెందింది. మన తెలుగులో రూపకం,నాటకం, నాటిక అనే ప్రక్రియలు ఉద్భవించడం ఈ అభివృద్ధిలో భాగమే.

నాటకం సంగీతం గానం నృత్యం మూడింటి రూపం.తెలుగు నాటకం మీద పరిశోధన చేసిన పండితులు ఎందరో ఉన్నారు. వీరిలో పి ఎస్ ఆర్ అప్పారావు తెలుగు నాటక వికాసం అనే గ్రంథాన్న పరిశీలిస్తే-1960 నాటికే రెండు వేల నాటకాలు,నాల్గువేల ఏకాంకిలు,నాటికలు,వెయ్యి మంది వరకు నాటక రచయితలు ఉన్నారని తెలుస్తుంది.1860 --1960 వందేండ్ల తెలుగు నాటక రంగాన్ని అధ్యనం చేస్తే- నాటక రచన-ప్రదర్శనల్లో ముఖ్యంగా మూడు దశలు కనిపిస్తున్నాయి.1 ప్రారంభ దశ (1860--1886),2.ప్రయోగ దశ (1886--1920),3.ప్రాశస్త్య దశ( 1920-1960)లు పరిచయమవుతాయి. ఆ తర్వాత దశను పరివర్తన దశ (1960-2020)గా నిర్ధారించుకోవచ్చు. ఆచార్య ఆత్రేయను ప్రాశస్త్య దశకు సంబంధించిన నాటక రచయితగా మనం పేర్కొనవచ్చు.ఆత్రేయ గీతం, సంగీతం, సామాజిక విప్లవ ఆంతర్యం తెలిసిన అగ్రశ్రేణి పండితుడు. జర్నలిస్టు, కమ్యూనిస్టు. రచన సామాజిక బాధ్యత అని గుర్తెరిగినవాడు. సంఘ సంస్కరణ(Social Reform),సాంఘిక పరివర్తన( Social Transfemation), సార్వత్రిక శాంతి( Universal Peace) ఆత్రేయ రచనా దృక్పథాలుగా మనకు తన రచనలో ద్వారా అవగతమవుతాయి. ఆత్రేయ పది నాటకాలు, పదిహేను నాటికలు రాశారు.ఇవన్నీ ప్రక్రియా పరంగానే కాకుండా ఇతివృత్తం భావజాల పరంగా కూడా ఎంతో గణుతికెక్కినవి.పద్నాల్గు వందల సినీగీతాలు రాశారు. అనేక కథలనూ వెలువరించారు.

అరిస్టాటిల్ మహానుభావుడు నాటక స్వరూపాన్ని గురించి ప్రస్తావిస్తూ ప్లాట్,కారెక్టర్స్,థాట్,డిక్షన్, స్పెక్టాకల్,రిథమ్ ఆఫ్ స్పీచ్ అనే ఆరు అంశాలకు ప్రాధాన్యత ఉంటుందంటాడు .ఇవాల్టి ప్రసంగాంశమైన 'వాస్తవం'నాటకంలో వీటిని లక్షణంగా పాటించాడు ఆత్రేయ. కన్సర్వేటిజానికి ప్రోగ్రెస్సివిజానికి మధ్య సంఘర్షణ ఈ నాటకంలోని కథ. ఇందులోని పాత్రలు:

* ఆనందయ్య మంత్రి - ప్రజా ద్రోహి- కాంగ్రేసులో లోపాయికారి పద్ధతిలో గెలిచినవాడు. కమ్యూనిస్టు వ్యతిరేకి. ప్రతినాయకుడు.

* వెంకటాద్రి-స్వాతంత్ర్య సమరయోధుడు గాంధేయవాది.అభ్యుదయ కాముకుడు. ఆనందయ్య కుట్రలకు బలి అవుతాడు.

* సత్యం కమ్యూనిస్టు. ప్రగతిశీల ఉద్యమకారుడు. ఆనందయ్య కుట్రకు అరెస్టవుతాడు. వెంకటాద్రికి ప్రేరణ ఇచ్చి ఉద్యమోన్ముఖుణ్ణి చేస్తాడు. ఇంకో ఐదారు సహపాత్రలు ఈ నాటకంలో సందర్భానుసారంగా వచ్చివెళ్తాయి.ప్రజాదర్శాలకోసం నిలబడ్డ వాళ్లు అధికారమదాంధుల చేత అవమానాలెదుర్కొంటారు. మరణిస్తారు.కానీ ఆదర్శాలకు కొనసాగింపు ఉంటుందనేది ఈ నాటకం అందించే ఆలోచన.స్థల కాలాలను అనుసరించి వాడు భాష, పాత్రోచిత భాష నాటక్ మొత్తాన్ని ఆకట్టుకంటుంది. ప్రజల ప్రధాన సమస్యను-తదనుగుణ పోరాటాన్ని అర్థం చేయించటం ఈ నాటకంలో స్పెక్టాకిల్. అలరించే పాటలు,పద్యాలు,నాటకీయత ఇందులో రిథమ్ ఆఫ్ స్పీచ్.

సుప్రసిద్ధ జర్మన్ సాహిత్యవేత్త నాటక కర్త గుస్తోవ్ ఫ్రెటాగ్ రూపొందించినదే Gustav Freytag'Pyramid.ఈ ఆకృతిని ఒక సారి పరిశీలిస్తే నాటక ఆరంభ నుండి ముగింపు దాకా కథా గమనానికి,నిర్వహణకు సంబంధించిన విషయాలన్నీ దృశ్యమానం అవుతాయి. గుస్తోవ్ పిరమిడ్ లో మొదటి అంశాలైన వ్యాఖ్యానం-కథారంభం (Exposition and inciting incidents) మనకు వాస్తవం నాటకంలో ఒకటోరంగంలో కనపడతాయి.చెవిటివాడి పాత్ర ఆలపించే ఓటుగీతం, కథానాయకుడైన సత్యం కార్యకలాపాలపై నిఘా పెట్టిన ఆనందయ్య వర్గం చేసే సంభాషణ ఆందుము ఉదాహరణలు. రెండోదైన కథోద్ధతి(Rising of action)కి

ద్వితీయ రంగం, తృతీయ రంగంలో వెంకటాద్రి,సత్యం పాత్రల కలయిక, సామాజిక కార్యకలాపాల ద్వారా, సత్యం ఆక్రమ అరెస్టు, స్వాతంత్ర్య సమరయోధుడు నీతి నిజాయితీలకు ప్రతిరూపమైన వెంకటాద్రి సంఘుసేవకు పునరంకితం కావడం వంటి దృశ్యాలు ఉదాహరణలు.మూడో దైన పరాకష్ఠ (Climax),నాల్గోదైన కథావనతం పరిష్కారం, సందేశం ( Falling of action,Resolution and Denouement) నాల్గో రంగంలో ఉంటాయి.ఆనందయ్య కుట్రలకు వెంకటాద్రి పోలీసు కాల్పుల్లో మరణించడం, సత్యం విడుదల,ఆనందయ్యలో పరివర్తనకు అద్దంపట్టే కథానాయకుడు సత్యం చదివిన లేఖ మొదలైన దృశ్యాలతో వాస్తవం నాటకం ఫలవంతం అవుతుంది. శాంతం ప్రధాన రసంగా,వీరం,కరుణం ఉపరసాలుగా భాసిల్లిన ఈ నాటకం సమకాలీనతకు

ప్రతిబింబం.జాతీయోద్యమ కాలంనాటి ఆశయాలకు పూర్తి విలోమంగా నడుస్తున్న ప్రస్తుత సమాజంలో స్వాతంత్ర్య అమృతోత్సవాల సందర్భాన ఈ నాటకం ఎంతో ప్రాసంగికతను కలిగివుంది.

ఏ సాహిత్య ప్రక్రియ అయినా రూపగతమైన తన లక్షణాల వలన పాఠకుల మన్నన పొందగలుగుతుంది.

అయితే రచయిత సృజన నైపుణ్యం వలన ఆ ప్రక్రియ మరింత ఉత్తమంగా రూపొందుతుంది. రచయిత ప్రదర్శించే భావుకత చేత,అనుసరించే భావజాలం మూలాన రచన పరిపుష్టం అవుతుంది.ఆత్రేయ సంగీత సాహిత్యాల విపుల నిధి. సామాజిక బాధ్యత తెలిసినవాడు.వెండితెరకు బంగారం వంటి గీతాలను అనేకం అందించిన రసమయి. నాటకం, వీధినాటకం

ప్రజావళిని అలరిస్తున్న ప్రాశస్త్య దశకు చెందిన ప్రజానాటక

రచయిత.ఈ మొత్తం కలిస్తే వాస్తవం నాటకం.కెథార్సిస్ వర్థిల్లి ప్రేక్షకుల్ని కేరింతలు కొట్టించగల వరుస నాటకాలతో

తెలుగు నాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ధీశాలి అయిన ఆత్రేయ సృజన శ్రేష్ఠత గురించి " ఏమాత్రం స్టఫ్ లేని scene కూడా డ్రమెటైజ్ చేయగల శక్తి ఉంది " అని ఆరుద్ర ఓ సందర్భంలో ఆత్రేయను ప్రస్తుతించారు.ఎన్నో నాటకాలు రాసిన ఆత్రేయ నాటక రంగం గురించి తానేమనుకున్నాడో తెలియాలంటే ,ఆయనే 1967లో రాసిన ఓ వ్యాసం లో "నాటకాల క్వాలిటీ తగ్గిపోవడానికి కారణం - నాటకాల్లో సినిమా అనుకరణ ఎక్కువ కావడం. ఇంకో కారణం - నాటకంలో పాత్రలు సమాజంలోని సజీవ వ్యక్తులు కాకుండా, రచయిత సృష్టించి, అతని విసురులకు, చెణుకులకు సాధనాలుగా పనిచేసేవి కావడం!" అంటారు.ఆయన నాటకరంగాన్ని విడిచి వచ్చినా ఆ బాధ చివరదాకా రగులుతూ తనలో ఉండిపోయింది. ఎర్రమల్లెలు అనే ఓ నాటకాన్ని ప్రారంభించి దాన్ని పూర్తి చేయలేక గణేష్ పాత్రోను పూర్తి చెయ్యమన్నారట. ఆయనవల్లా కాలేదు. అప్పుడు ఆచార్య ఆత్రేయ అన్నారట - మనం నాటకాన్ని ప్రేమించాం. సినిమాని పెళ్లాడాం. మన బ్రతుకులు ఇంతే. నాటకాన్ని మరవలేము, సినిమాని విడవలేము.' అని.ఇట్లా పరితపించడం మదనపడటం చూస్తే తెలుగు నాటకం సర్వతోముఖాభివృద్ధిని ఆత్రేయ ఎంతగా కాంక్షించారో మనకు తెలుస్తుంది,నాటక సృజనలోకి చొరబడిన కృత్రిమత్వం,సినిమా తాలూకు వ్యాపారత్వమూ మనకు అర్థమవుతుంది.

ఆధార గ్రంథాలు:

1.Shyamala Guptha,Sry Beauty and creativity,D.K.Printworld(P) Ltd,1999.

2.పి.ఎస్.అప్పారావు,తెలుగు నాటక వికాసం,శివాజీ ప్రెస్,సికింద్రాబాద్,1960.

3.సాయి బ్రహ్మానందం గొర్తి,తెరమరుగవుతున్న తెలుగు నాటకం,ఈమాట,జనవరి,2008.

4.Alan Maley and Alen Duff,Drama Teqhniques, Cambridge University Press,2005.